కథానిక

# 'సూటు కేసు'

ఐతా చంద్రయ్య



**తూ**ర్పు ఆకాశం ఎర్ర బారకముందే ఆవులిస్తూ నిద్రలేచి రోజువారీ పనులు ముగించుకుని బుద్ధిగా దేవాలయానికి వెళ్ళి రావటం శివచంద్రము దినచర్య. సినిమాలంటే ఇష్టమే కాని అర్ధరాత్రిదాకా మెలకువగా ఉండాలంటే ఆటంబాంబు జేబులో ఉన్నట్టు ఫీలవుతాడు.

అంతకు ముందు రోజు... ఆత్మీయ మిత్రులతో హాయిగా గడుపుతూంటే సినిమా ప్రోగ్రాం ప్రస్తావన వచ్చింది. "సెకండు షోకు నేన్రాను" నిర్మొహమాటంగా చెప్పేశాడు. కాని బలవంతపు బ్రాహ్మణార్థములా వెళ్ళక తప్పలేదు. పర్యవసానంగా ఆరోజు ఉదయం నిద్రమత్తు నిండా ఆవహించి పదలనని భీష్మించుకుక్కూచుంది. ఐదింటికి మంచాన్నొదిలెయ్యాలనుకుంటే అటూ ఇటూ ఆలోచనతో, మగత నిద్ర తిష్టవేసుకుంది. గోడ గడియారం ట్రింగ్ ట్రింగ్ మంటూ ఏడుసార్లు మందలించింది.

"వామ్మో! ఏడైపోయిందే!" గొణుక్కొంటూ బద్ధకంగా ఆవులించాడు. కట్టుకున్న భార్య వంటింట్లో ఉందని స్టౌ శబ్దం చెబుతోంది. ఎకా ఎకిన ఎగిరి గంతెయ్యాలంటే ఒళ్ళు సహకరించలేదు. మెల్లిగా లేచి కళ్ళు నులుముకుని మంచం దిగాడు. పళ్ళూ, ఒళ్ళు తోముకుని పదిలోపల బయట పడ్డాడు. కాళ్ళు దేవాలయానికి లాక్కెళ్ళాయి. అది ఆదివారము.

బయట... బొచ్చెలూపుతూ గీపెడుతున్న బిచ్చగాళ్ళను కన్నెత్తైనా చూడకుండా ఏకంగా దేవాలయంలో ప్రవేశించే సరికి పది దాటింది.

అప్పటికే ఆరగింపు పూర్తయింది. క్యూ కదులుతోంది. "అకాల మృత్యుహరణం..." మంత్రాన్ని ముచ్చటగా మొదటి మూడక్షరాల ఉచ్చరింపుతో పూర్తి చేస్తూ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు పంచుతున్నాడు. పొద్దున హన్మంతుని తోకలాగుండే క్యూ అరగంటలో బారెడైంది.

అంతవరదాకా చిల్లర ఆదాయం అనుకున్నంతగా రాలేదేమో పూజారి వాలకం కరువు కాలంలో నిరుపేదరైతుకూలీలాగైంది. తనకంటే ముందొచ్చి ముందు నుంచున్న భక్తుడు యువకుడు... దొరబాబులా పూర్తి సూటులో ఉన్నాడు. గులాబిరంగు

సూటు మీద నల్లని టై.... మెడలో నల్లనాగులా వేళ్లాడ్తోంది. హుషారుగా టీ.వీ. యాడ్ హీరోలా ముందుకు కదుల్తున్నాడు.

"మీరు.... చాలా అందంగా.... సినిమా హీరోలాగున్నారండీ!" షేక్ హ్యాండ్‌కు చేయిచాచాడు శివచంద్రం.

"థాంక్యూ....!!" వెనక్కు తిరిగి షేక్ హాండిచ్చాడు. కళ్ళలోకి చూస్తూ నిలబడి పోయాడు.

'వెరీ నైస్. తీర్థ ప్రసాదాలు తీసుకుందాం." గుర్తుచేశాడు - పూజారిని చూపిస్తూ.

"మీరు జంటిల్మెన్ లాగున్నారు" సూటువాలా చిరునవ్వుతో పూజారిముందుకు తిరిగాడు.

పూజారి కళ్ళల్లో ఆశ తళుక్కుమంది. సూటువాలా చెయ్యి కోటు జేబులో కెళ్ళింది. పది రూపాయలు బయటికొచ్చింది. అదే నోటుతో దేవునికి నమస్కరించి పూజారి చేతికిచ్చాడు.

పూజారిమొహం కర్పూర హారతిలా వెలిగింది.

"అయ్యా..., మీపేరు, గోత్రముచెప్పండి!! పదినోటును పదిలంగా బొడ్లోదోపుకుంటూ అడిగాడు. ఠీవిగాచెప్పాడతడు.

అమ్మ బాబోయ్! పూజారికి పదిరూపాయ లిచ్చాడంటే...బడాబాబు కోటీశ్వరుడయుంటాడు....! అతన్తో కరచాలనం చెయ్యడం తన అదృష్టంగా భావించాడు శివచంద్రము.

హారతి పళ్ళెంలో అర్జంటుగా కర్పూరం బిళ్ళలు వెలిగినై. హారతి విగ్రహం ముందు తిరుగుతోంది. మరో చేతిలో గంట మోగుతోంది. ఇంటిపేరు, పేరు, గోత్రనామాలతో నీరాజనా లందాయి. శివచంద్రం సాక్షిగా హారతి పళ్ళెం సూటువాలా ముందుకొచ్చింది. భక్తితో కళ్ళకద్దుకున్నాడతడు.

"ఆహా! ధనవంతులందరూ ఇలాగే గుణవంతులైతే ఎంత బాగుండేదో!" లోలోపల అనుకుంటూ శివచంద్రం సూటువాలా పక్కకొచ్చి నుంచున్నాడు. అర్ధరూపాయి హారతి పళ్ళెంలో వేసి చేతులు ముందుకు తెచ్చాడు. హారతి కళ్ళకద్దుకోవాలని.

పూజారి పాతవాడే కాని శివచంద్రాన్ని కొత్తగా చూస్తూ నిరసనగా ఏదో గొణుక్కున్నాడు. దసరానాడు వేటగాడు బుట్టలున్న పాల పిట్టను చూపించినట్టు - హారతి పళ్ళాన్నిలా ముందుకు తెచ్చి వెంటనే వెనక్కు తీసుకున్నాడు. మూలవిరాట్టు మెడ దండలోంచి ఓ పూవులాగి సూటు భక్తుని దోసిట్లో ఉంచాడు. "అకాల మృత్యుహరణం" మంత్రం ఆసాంతం ఉచ్చరిస్తూ మూడుసార్లు ఉద్దరిణితో తీర్థం పెట్టాడు. ఓ అరటి పండును ప్రసాదంగా ప్రసాదించి ఓ చిరునవ్వు విసిరాడు.

సూటువాలా చేతుల్ని చేతిగుడ్డతో తుడుచుకుంటూ

"అయ్యా! ఆ పది రూపాయిలోంచి ఓ పావలా మీరుంచుకుని మిగతా చిల్లర డబ్బులివ్వండి!! రెండు చేతులు కోటు జేబుల్లో ఉంచుకుని స్టైలుగా కాలాడిస్తున్నాడు. పూజారి గెడ్డం తడుముకుంటూంటే

"అం....టే...." నోరు ఆలయంగేటులా తెరుచుకుంది.

"అంతేనండి... మిగతా తొమ్మిది రూపాయల ముప్పా వలా పావలా బిళ్ళల్లో ఇవ్వండి వివరణ ఇచ్చేశాడు.

అప్పటికే క్యూ పెరిగి పోతోంది.

"అయ్యయ్యో.... అట్లానా!" పూజారి కనురెప్పలు బాణం గుచ్చుకున్న పక్షి రెక్కల్లా కదలాడినై

(తరువాయి భాగం25వ పేజీలో...)

**చిత్తరంజన్‌దాస్‌జయంతి**

చిత్తరంజన్‌దాస్ 5-11-1870న బెంగాల్‌లో జన్మించాడు. ఇంగ్లండులో బారిస్టర్ పూర్తిచేసి 1893నుండి కలకత్తా హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించాడు. మాలాంచా మాలా, సాగర్ సంగీత్ మొదలైన రచనలు చేశాడు. 1914లో 'నారాయణ'అనే పేరుతో బెంగాలీ భాషలో మాసపత్రికను నడిపాడు. అకళంక దేశభక్తుడు, 1-1-1923న మోతీలాల్ నెహ్రూతో కలిసి స్వరాజ్ పార్టీని స్థాపించాడు వీరికి 'దేశబంధు' అనే బిరుదముంది.